# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
తేది : 11 మే, 2021.

తిరుపతి రుయా ఆసుపత్రిలో సోమవారం రాత్రి ఐసియులో ఉన్నప్పటికీ ఆక్సిజన్ అందక 11 మంది కరోనా రోగులు మరణించడం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. మంగళవారం నాడు ఎం.వి.ఎస్. శర్మ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఆ రోగుల మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

ప్రధానమైన ఆసుపత్రులకు సైతం ఆక్సిజన్ సరఫరా గ్యారంటీ చేయలేకపోవడం బట్టి, రెండో విడత కరోనా దశలో తీసుకోవలసిన చర్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తగిన అప్రమత్తతను, బాధ్యతను ప్రదర్శించడంలేదని భావించాల్సివుంటుంది. రుయా ఘటన కన్నా ముందు హిందూపురం, విజయనగరం, కర్నూలు తదితర చోట్ల ఆక్సిజన్ కొరతతో ప్రాణాలు కోల్పోయారు. అన్ని జిల్లాల్లోనూ ఆక్సిజన్ కొరత సమస్య ఉన్నది. అయినా ప్రభుత్వం ఆక్సిజన్ సరఫరాను మానిటర్ చేయడంలో విఫలమైంది.

ఇప్పుడు కరోనా మారుమూల గ్రామాలకు సైతం విస్తరిస్తున్న వార్తలు వస్తున్నాయి. కేసుల సంఖ్య, మరణాల సంఖ్య వాస్తవంలో ఉన్నదానికన్నా అధికారిక లెక్కల్లో తక్కువగా చూపిస్తున్నారని మా పరిశీలనలో వెల్లడైంది. ఇది అధికారులలో తగిన మోతాదులో అప్రమత్తత తేకపోవడానికే దారి తీస్తుంది. పరిస్థితిని చక్కదిద్దే చర్యలు వెంటనే చేపట్టాలని సిపిఐ(యం) కోరుతోంది.

స్థానిక ఎన్నికలు జరిగి ఆ పాలక వర్గాలన్నీ కొలువు తీరాయి. కరోనా పై పోరులో వాటికి తగు భాగస్వామ్యం కల్పించి రాష్ట్ర వైద్య వ్యవస్థ పనిని, కరోనా నియంత్రణ కార్యక్రమాలను వికేంద్రీకరించాలి. గ్రామ సచివాలయాలకు ఎక్కడికక్కడ బాధ్యతలు కేటాయించాలి. గ్రామస్థాయి వరకూ వనరులను అందించాలి. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లోనూ ఐసోలేషన్ సెంటర్ కేంద్రాలను ప్రారంభించాలి. ప్రజల సహకారం తీసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పట్టు పట్టడానికి ఇది తోడ్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు, సలహాలు తీసుకోవడంతోబాటు కరోనా పై పోరాటంలో వారి సహకారం కూడా తీసుకుని అందరినీ భాగస్వాముల్ని చేయాలి.

అస్తవ్యస్తంగా ఉన్న వ్యాక్సిన్ పంపిణీ విధానం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ప్రతీ వ్యాక్సినేషన్ కేంద్రం వద్దా వందలాది మంది గుమిగూడడం ప్రమాదకరం. దానిని నివారించాలి. రాష్ట్రానికి అవసరమైన వ్యాక్సిన్ డోసులను కేటాయించేలా, ఆక్సిజన్‌తోబాటు ఇతర కీలక పరికరాలు, మందుల సరఫరా రాష్ట్రానికి అందేవిధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత కష్టకాలంలో అన్నివిధాలా తమకు అండగా నిలుస్తుందన్న భరోసా ప్రజలకు కలగాలంటే ప్రకటనలు, నిర్ణయాలు సరిపోవని, ఆచరణలో అన్ని స్థాయిలలో సకాలంలో స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం గమనించాలి.

(వెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి